




# ఈకాలం

THE HONEST TELUGU DAILY








శుక్రవారం 13-03-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :134 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల




6

## లోక్‌సభను తాకిన గ్యాస్ సెగలు

- రష్యా నుంచిచమురుకు అమెరికా ఆమోదమేంటని నిలదీసిన విపక్షం - దేశ సార్వభౌధికారాన్ని అగ్రరాజ్యం చేతిలో పెడతారా? - ఎప్టీన్ ఫైల్స్ను ప్రస్తావించిన రాహుల్ గాంధీ - రాహుల్ వ్యాఖ్యలు సభా మర్యాదలకు విరుద్ధంగా ఉన్నాయన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి

## ఇరాన్ ప్రభుత్వం కూలిపోయే ముప్పు లేదు



అమెరికా నిఘా సంచలన నివేదిక్న సుప్రీం లీడర్ దాడుల్లో మరణించడంతో ప్రభుత్వం కూలిపోతుందన్న అమెరికా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరానియన్లకు పిలుప్న మత నాయకత్వ వ్యవస్థ బలంగా ఉందన్న గూఢచారి నివేదిక అంచనాలు తల్లకిందులు కావటంతో ట్రంప్ మల్లగుల్లాలు

## ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లు

- భారీ వాహనాలను అనుమతించకూడదు ప్రణాళికలను రూపొందించాలి
- సీఎం రేవంత్రెడ్డి కీలక ఆదేశాలు



ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడటంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు.

## అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ సూచన..!

- పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా
- ప్రస్తుత స్థితి ప్రజల ముందు ఉంచాలని ప్రధాని మోడీ మంత్రులకు ఆదేశాలు



ఇరాన్లో జరుగుతున్న యుద్ధం మధ్య, దేశంలోని చాలా ప్రాంతాలలో గ్యాస్ కొరత పెరుగుతోంది. సిలిండర్ల కోసం పొడవైన లైన్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని ప్రధాని మోదీ తన మంత్రులను ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సన్నాహాలు బలంగా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




- అంతర్జాతీయ చమురు ధరల ఒడిదొడుకులతో మార్కెట్లకు భారీగా నష్టాలు
- సెన్సెక్స్ 829 పాయింట్లు, నిఫ్టీ 227 పాయింట్లు నష్టం
- తీవ్రంగా నష్టపోయిన ఆటో, ఎఫ్ఎంసీజీ, రియాల్టీ రంగాల షేర్ల
- ఇంధన భద్రతపై ఇరాన్తో చర్చలు జరిపిన భారత విదేశాంగ మంత్రి

## కమర్షియల్ సిలిండర్ల కొరత ఉంది



తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు.

## విద్యాసంస్థలు - పరిశ్రమల అనుసంధానం అవసరం


జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభలో కృష్ణయ్య ప్రసంగించారు.

## బీఆర్ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్..

- పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పు



ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్ తగిలింది. దీంట్లో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం విచారణను ముగిస్తున్నట్టుగా పేర్కొంది. క్రితంసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బి ఫాంపై నెగ్గిన పదిమంది ఎమ్మెల్యేలు ఆ తరువాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారని పేర్కొంటూ వారిపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ కు కూడా ఫిర్యాదులు చేశారు. కాగా, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## బడ్జెట్పై కసరత్తు ముమ్మరం

- అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనపై చర్చ
- ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై ఆరా
- హోం, ఐటీ శాఖలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష



అసెంబ్లీ సమావేశాలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్పై కసరత్తును ముమ్మరం చేస్తోంది. శాఖల వారిగా ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన మరియు ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, పోలీసు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిగినట్లు భట్టి వెల్లడించారు.

# సంపాదకీయం

## ఒక ముగింపు, మరో ఆరంభం!

'రాజ్యాంగ విలువలను విశ్వసించే వాజపేయి నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీతో నేను పొత్తు పెట్టుకున్నాను. లౌకికవాద నేతగా, ఓట్లు కైవసం చేసుకునేందుకై హిందువులు--ముస్లింల మధ్య విభేదాలు, వైషమ్యాలు సృష్టించేందుకు ప్రయత్నించే నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీతో కలవలేను'... ఇవి, 2013 జూన్‌లో బీజేపీతో తెగతెంపులు చేసుకున్న సందర్భంలో నితీశ్‌కుమార్ ఉద్ఘాటనలు.'నా రాజకీయ జీవితం మొదలయినప్పుడు బిహార్ శాసన వ్యవస్థ ఉభయ సభలలోను, పార్లమెంటు ఉభయ సభలలోను సభ్యుడుగా కావాలని ప్రగాఢంగా కోరుకునేవాణ్ణి'... ఇవి, 2026 మార్చిలో రాజ్యసభకు పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నానని ప్రకటించిన సందర్భంలో నితీశ్ చెప్పిన మాటలు!

భారత రాజకీయాలలో పదమూడు సంవత్సరాలు ఒక సుదీర్ఘకాలం. ఒక దశాబ్దం క్రితం మోదీకి దీటైన ప్రత్యర్థిగా ప్రఖ్యాతుడై ఆ తరువాత క్రమంగా ఆ స్థానం నుంచి దిగజారుతూ చివరకు ఇప్పుడు మార్గదర్శక్ మండల్ వంటి 'వృద్ధాశ్రమం'లోకి నెట్టివేతకు గురవుతోన్న నేత నితీశ్‌కుమార్. కాలం నిర్దయగా తెచ్చిన ఈ మార్పు మోదీ కేంద్రిత రాజకీయ విశ్వంలో అసహజమైనదేమీ కాదు.

నితీశ్‌కుమార్ విద్యాధిక రాజకీయవేత్త. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన ఆయన 2005లో బిహార్ ముఖ్యమంత్రిగా రెండోసారి పదవీ ప్రమాణం చేశారు. బిహార్‌ను ఆ రోజుల్లో భారతదేశ రాజకీయ భ్రష్టత్వానికి చిహ్నంగా పరిగణించేవారు. ఎన్నో ప్రతికూలతలను అధిగమిస్తూ రెండు దశాబ్దాల పాటు అధికారంలో కొనసాగిన నితీశ్, ఆ రాష్ట్ర రాజకీయాలను పునరావిష్కరించారు. అంతకంటే ముఖ్యంగా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండేందుకై ఆయన తనను తాను అనేకసార్లు ప్రభావవంతంగా పునరావిష్కరించుకున్నారు! సమకాలీన భారతదేశంలో నితీశ్‌కుమార్ వలే తరచూ భిన్న పార్టీలతో జట్టు కడుతూ అధికారాన్ని నిలబెట్టుకున్న రాజకీయవేత్త మరొకరు లేరు. ఉన్నా, వారి సంఖ్య చాలా తక్కువ అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఆయన రాజకీయ కసరత్తులు అపూర్వమైనవి. నితీశ్ తాజా రాజకీయ ప్రస్థానం ఆ అసాధారణ రాజకీయాలకు అంతిమంగా స్వస్తి వాక్యం పలికింది.ఇప్పుడు నితీశ్ పాట్నా అధికార నడవాలకు చాలా దూరంగా ఢిల్లీలోని పార్లమెంటుకు వెళ్లనున్నారు. రెండు దశాబ్దాల పాటు బిహార్ రాజకీయాలను నిర్దేశించిన ఘటనా ఘటన సమర్థుడు నితీశ్‌కుమార్. అయినా ఇప్పుడు ఆయన పాట్నాను వీడి న్యూఢిల్లీకి వెళ్లిపోక తప్పడం లేదు. బిహార్ నుంచి ఆయన నిష్క్రమణ లోగుట్టు ఏమైనప్పటికీ పాలక కూటమిలో అధికార సమతుల్యత నిర్ణయాత్మకంగా మారిపోయింది. మోదీ హయాంలో మాత్రమే ఇటువంటి మార్పులుచోటు చేసుకోవడం పరిపాటి.బిహార్‌లో అధికారాన్ని సంపూర్ణంగా స్వాధీనం చేసుకోవడమనేది భారతీయ జనతా పార్టీకి చాలా కాలంగా సాధించలేని లక్ష్యంగా ఉండిపోయింది. జాతీయ స్థాయిలో అధికారాన్ని వరుసగా గెలుచుకుంటున్నప్పటికీ బిహార్‌లో మాత్రం అధికార కైవసం ఒక అసంపూర్ణ లక్ష్య సాధనగా మిగిలిపోయింది. రాజకీయాలు 'మండలీకరణ' అయిన నేపథ్యంలో అగ్రకులాల పార్టీ అనే ముద్ర నుంచి బీజేపీ బయటపడలేకపోవడం వల్లే బిహార్‌లో బీజేపీకి అధికారం దక్కడం అసాధ్యమైపోయింది. వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధికి ముఖ్యమంత్రిగా నితీశ్ ఇతోధిక కృషి చేశారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ బిహార్‌లో నిలదొక్కుకునేందుకూ బాగా తోడ్పడ్డారు. సుపరిపాలనను అందించడం ద్వారా తన పార్టీ సామాజిక పునాదులను పటిష్ఠ పరచుకోవడంలో సఫలమయ్యారు. ఒక ప్రాంతీయ నాయకుడిగా ఆయనకు లభించిన ప్రజాదరణ, గౌరవ ప్రతిపత్తులు బిహార్‌లో బీజేపీ ఎదుగుదలను ఒక విధంగా కట్టడి చేశాయని చెప్పవచ్చు.

అయితే రోజులన్నీ నితీశ్‌కు అనుకూలంగా లేవు. అసెంబ్లీ లేదా లోక్‌సభకు ఎన్నికలు జరిగిన ప్రతిసారీ బిహార్‌లో బీజేపీకి లభించిన ఓట్లు, సీట్ల సంఖ్య పెరుగుదల విస్మరించలేని రాజకీయ వాస్తవంగా స్థిరపడింది. ఒకప్పుడు నితీశకుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యునైటెడ్)కు జూనియర్ భాగస్వామిగా ఉన్న బీజేపీ క్రమంగా ఎన్డీఏలో ఒక శక్తిమంతమైన పార్టీగా ప్రభవించింది. 2020 శాసనసభా ఎన్నికలలో జనతాదళ్(యు) కంటే ఎక్కువ సీట్లు బీజేపీ గెలుచుకున్నది. ఈ విజయం బిహార్‌లో ఆ పార్టీకి ఒక మేలు మలుపు. నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగారు.

బిహార్‌లో తమ పార్టీ సొంత కాళ్లపై నిలబడి అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలనేది బీజేపీ జాతీయ నాయకత్వ దీర్ఘకాలిక లక్ష్యం. కనుకనే జనతాదళ్ (యు) కంటే తమకు ఎక్కువ సీట్లు లభించినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడం రాజకీయంగా తమకు శ్రేయస్కరం కాదని బీజేపీ నాయకత్వం గుర్తించింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలలో ఆయనకు అపారమైన పలుకుబడి ఉన్నది.

ఇప్పుడు నితీశ్‌ను గౌరవప్రదంగా రాజ్యసభకు పంపించడం ద్వారా బీజేపీ ఏకకాలంలో రెండు లక్ష్యాలను సాధించింది. బిహార్ అధికార వ్యవస్థల్లో తన సంపూర్ణ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోవడంలో సఫలమయింది. ప్రత్యక్ష ఘర్షణ, ఆకస్మిక విచ్ఛిన్నం తదితర గజిబిజి రాజకీయ పరిస్థితులు తలెత్తవలసిన అవసరం లేకుండానే తన ప్రాబల్యాన్ని సంపూర్ణంగా నెలకొల్పుకోగలిగింది. బిహార్‌లో బీజేపీ చాణక్యాన్ని ఒక మృదువైన రాజకీయ తిరుగుబాటుగా అభివర్ణించవచ్చు.భారత రాజకీయాలలో ఇటువంటి ఎత్తుగడలు కొత్తవేమీ కావు. వ్యూహాత్మక ఉపయుక్తతను కోల్పోయిన నాయకులు గౌరవప్రదంగా క్రియాశీల రాజకీయాల నుంచి నిష్క్రమించేందుకు అవకాశాలను కల్పించడం ఒక సంప్రదాయంగా వస్తోంది. గవర్నర్లుగా లేదా పార్లమెంటరీ పదవులలో నియమితులు కావడం జరుగుతోంది. బిహార్ ముఖ్యమంత్రి పదవి నుంచి నితీశ్ గౌరవప్రద నిష్క్రమణకు ఒక విస్తృత ప్రాధాన్యమున్నది. దేశ రాజకీయాలలో అగ్రనాయక ద్వయంగా వెలుగొందుతోన్న నరేంద్ర మోదీ-- అమిత్ షాల రాజకీయ కార్యాచరణ శైలిని ఆ ఉదంతం పూర్తిగా ప్రతిబింబించింది.

మోదీ--షాల శక్తిమంతమైన నాయకత్వం ఆలంబనతో బీజేపీ ఒక కేంద్రీకృత ఎన్నికల యంత్రాంగంగా పని చేస్తోంది. విజయాలే లక్ష్యంగా ఎన్నికలలో పొత్తులకు ప్రాంతీయ పార్టీలను ఆహ్వానిస్తున్నారు. కొన్ని సందర్భాలలో అటువంటి పొత్తులు తప్పనిసరి కూడా. అయితే పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ పార్టీలను శాశ్వత భాగస్వామ్య పక్షాలుగా బీజేపీ పరిగణించడం లేదు. ఆ పొత్తుల చరిత్ర ఒకే రీతిలో ఉంటోంది. తొలుత ఒక కూటమిలో భాగస్వాములవుతారు. ఆ తరువాత కూటమిలోని పెద్ద పార్టీ సంస్థాగతంగా విస్తరిస్తుంది. అంతిమంగా భాగస్వామ్య పక్షాల మధ్య అధికార సమతుల్యత మారుతుంది. ఫలితంగా పొత్తు పెట్టుకున్న భాగస్వామ్య పక్షాన్ని పక్కకు నెట్టివేస్తారు. అసోంలో ఏజీపీతోను, మహారాష్ట్రలో శివసేనతోను, గోవాలో ఎమ్‌జీపీతోను బీజేపీ పొత్తుల చరిత్ర పూర్తిగా ప్రస్తావిత ఘటనల క్రమాన్ని ప్రతిబింబిస్తుందనడం సత్యదూరం కాదు. ప్రాబల్య ప్రాభవాలను కోల్పోయిన ప్రాంతీయ పార్టీల స్థానంలో బీజేపీ బలపడి సుస్థిరమవడమే ఎల్లెడలా జరిగింది.ఒక విస్తృత ప్రశ్నను కూడా మనం తరచి చూడవలసిన అవసరమున్నది: బిహార్ అధికార రంగం నుంచి నితీశ్ నిష్క్రమించిన తీరు తెన్నులు జాతీయ పాలక కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలకు ఎటువంటి సందేశాన్ని పంపుతున్నాయి? శక్తిమంతమైన ప్రాంతీయ రాజకీయ శక్తుల ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, త్వరలో ఎన్నికలకు వెళ్లనున్న తమిళనాడులో అన్నాడీఎంకే --తో పాటు వ్యూహాత్మకంగా కీలకమైన వివిధ చిన్న పార్టీలు నేటి ఎన్డీఏలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి.

# ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లు

ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడటంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం తెలిపారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్ యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్ యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.ఇక ఎలక్ట్రిక్ వాహనాలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశార. ఇక నుంచి ప్రభుత్వంలోని ఏ శాఖైనా తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్లైన్లోనే కార్యకలాపాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని... ఇందుకు షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్ కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ నిర్ణయమే ఫైనల్

ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీకి సుప్రీం కోర్టులో షాక్ తగిలింది. దీంట్లో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం విచారణను ముగిస్తున్నట్టుగా పేర్కొంది. క్రితంసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీ ఫాంపై నెగ్గిన పదిమంది ఎమ్మెల్యేలు ఆ తరువాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారని పేర్కొంటూ వారిపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ కు కూడా ఫిర్యాదులు చేశారు. కాగా, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఆదేశాలు జారీ చేసింది. పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఈ క్రమంలో విచారణ ముగించిన స్పీకర్ మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. వాళ్లు పార్టీ మారారనటానికి ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. కాగా, బీఆర్ఎస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ లతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా స్పీకర్ తరపున వాదనలు వినిపించిన అభిషేక్ సింఘ్వీ ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై ఇప్పటికే విచారణ ముగిసినట్టు చెప్పారు. ఇక విచారణ జరపాల్సిన అవసరం లేదు. దీంట్లో వెల్లడైన వివరాల ఆధారంగా స్పీకర్ తగు నిర్ణయం కూడా తీసుకున్నారని చెప్పారు.పిటిషన్లను స్పీకర్ కార్యాలయం పరిష్కరించిందన్నారు. ఈ వాదనలతో సుప్రీం కోర్టు ఏకీభవించిందవి. స్పీకర్ ఈ అంశంలో ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇక విచారణ జరపాల్సిన అవసరం లేదని అభిప్రాయ పడింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేల ఫిరాయింపులకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ ముగిసినట్టేనని పేర్కొంది. స్పీకర్ తన తీర్పును రెండు రోజుల్లో అధికారికంగా వెలువరించి ప్రతులను ఫిర్యాదుదారులకు అంద చేయాలని సూచించింది.

# విద్యాసంస్థలు - పరిశ్రమలు అనుసంధానం అవసరం..

విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభలో కృష్ణయ్య ప్రసంగించారు. ప్రస్తుతం విద్యా సంస్థలు మరియు పరిశ్రమలు తమ తమ స్వంత లక్ష్యాలు, ప్రయోజనాల దిశగా వేర్వేరు మార్గాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ, పరస్పర సహకారం ద్వారా ఇరు వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని వారు పేర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా చాలా కాలం క్రితమే పరిశ్రమలు--విద్యాసంస్థల సహకారం అవసరాన్ని గుర్తించాయి. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర నిధులు తగ్గుతున్న ఈ కాలంలో, పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకోవడం మరియు స్వావలంబన సాధించడం అత్యంత అవసరమైంది. అయితే పరిశ్రమల లాభాపేక్ష, గోప్యత వంటి అంశాలు కొన్నిసార్లు ఈ సహకారానికి అడ్డంకిగా మారుతున్నాయి. పరిశ్రమలు తమ ప్రాజెక్టులకు సంబంధించిన పరిశోధనలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా విశ్వవిద్యాలయాల పరిశోధన సామర్థ్యాలను పెంచవచ్చు. విశ్వవిద్యాలయాల వద్ద ఉన్న మానవ వనరులు మరియు పరిశ్రమల ఆర్థిక మద్దతు కలిసి పనిచేస్తే నూతన సాంకేతిక ఆవిష్కరణలకు దారి తీస్తాయి. ఉదాహరణకు, ఏరోస్పేస్ పరిశోధన కోసం కొన్ని అంతర్జాతీయ సంస్థలు విశ్వవిద్యాలయాలకు అందించిన నిధులు విమానయాన సాంకేతిక రంగంలో గణనీయమైన పురోగతికి దోహదపడ్డాయి. అదే సమయంలో విద్యాసంస్థలు కూడా పరిశ్రమలకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను కలిగించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా స్థానిక పరిశ్రమల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా కోర్సులు రూపొందిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విశ్వవిద్యాలయాల నుండి పట్టభద్రులయ్యే విద్యార్థుల్లో చాలా మంది పరిశ్రమల వైపు వెళ్లే నేపథ్యంలో పరిశ్రమలకు అనుకూలమైన నైపుణ్యాలు వారికి అందించడం అత్యంత కీలకం. విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యం సాంకేతిక అభివృద్ధికి, వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాల కోసం మరియు ఆర్థిక విలువ సృష్టించడానికి గొప్ప అవకాశాలను కల్పిస్తుంది. సరైన విధానాలు, పరస్పర గౌరవంతో ఇరు వర్గాలు కలిసి పనిచేస్తే అసాధారణ ఫలితాలు సాధ్యమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. పరిశ్రమలు మరియు విద్యాసంస్థల మధ్య పెరుగుతున్న ఈ పరస్పర సహకారం భవిష్యత్ అభివృద్ధి మరియు పురోగతికి కీలకంగా మారనుంది అని కృష్ణయ్య పేర్కొన్నారు.

# ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ ఆసుపత్రి ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్ కేర్ కేంద్రంగా జ అభివృద్ధి చెందుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో నూతనంగా ప్రారంభించిన మెడికవర్ ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆసుపత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ ప్రారంభంతో భారత్ లో మెడికవర్ ఆసుపత్రుల సంఖ్య 25కు చేరింది. ఈ నూతన ఆసుపత్రి దేశంలోనే అత్యంత ఎత్తైన ఆసుపత్రి భవనాలలో ఒకటిగా నిర్మించబడింది. అత్యాధునిక సదుపాయాలు, ఆధునిక వైద్య సాంకేతికతతో రూపొందించిన ఈ ఆసుపత్రిలో 550 పడకల సామర్థ్యం ఉంది. పలు ప్రత్యేక వైద్య విభాగాలలో సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఇది సిద్ధంగా ఉంది. ఈ ఆసుపత్రిలో ముఖ్యంగా 5 సెకన్లలో గుండె స్కాన్ పూర్తి చేసే అత్యాధునిక హార్ట్ స్కానింగ్ సాంకేతికతను తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ప్రవేశపెట్టారు.

అదేవిధంగా 640-స్లైస్ సీటీ స్కాన్ సాంకేతికతను ఏర్పాటు చేసి మరింత స్పష్టమైన చిత్రీకరణతో వేగవంతమైన మరియు ఖచ్చితమైన నిర్ధారణకు అవకాశం కల్పించారు.

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మెడికవర్ ఆసుపత్రుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెడికవర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జీ. అనిల్ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ. శరత్ రెడ్డి, పి. హరికృష్ణ, డైరెక్టర్ ఏ ఆర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఆధునిక వైద్య సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు మరియు సమగ్ర వైద్య విధానాలతో ఈ ఆసుపత్రి రోగులకు వేగవంతమైన సమర్థవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# బడ్జెట్పై కసరత్తు ముమ్మరం

శాంతిభద్రతల పరిరక్షణకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, పోలీసు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిగినట్లు భట్టి వెల్లడించారు. ఈ సమావేశంలో హోం శాఖ కార్యదర్శి సి.వి. ఆనంద్, ఏడీజీ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, మల్కాజ్ గిరి సీపీ అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఐటీ శాఖతోనూ.. హోంశాఖ సమీక్షా అనంతరం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసనసభ వ్యవహారాల శాఖల ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధింత శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఐటీ స్పెషల్ సెక్రటరీ భవేష్ మిశ్రా, టీజీఐఐసి ఎండి శశాంక్, ఇండస్ట్రీస్ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య ని పరామర్శించిన విజిలెన్స్ కమిటీ ఏటీపీఎస్



వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ గ్రామంలో ఓదెల మల్లయ్య తల్లి కీర్తిశేషులు ఓదెల ఐలమ్మ మరణించినందున వారి కుటుంబాన్ని పరామర్శించిన వారు టిడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఈసీ నెంబర్ జన్ను శ్రీనివాస్ బాబు అనగారిన కులాల తెలంగాణ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడుగుల రాంబాబు ఉమ్మడి వరంగల్ జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ వాసం సాంబయ్య వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యాన్ని అందించినారు.

## జీర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈరోజు పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మైతారి పాపమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. త్వరలో జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్షలను పురస్కరించుకొని, విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మ్యతారి పాపమ్మ మాట్లాడుతూ.. "విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి. పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మన జీర్లపల్లి గ్రామానికి, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.పాఠశాల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, విద్యార్థుల సౌకర్యార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరీక్షా సామగ్రిని అందుకున్న విద్యార్థులు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓఆర్ఆర్ మీద యాక్సిడెంట్



పటాన్చెరు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో అతివేగంగా వచ్చిన ఒక కారు, ఆటో ట్రాలీని బలంగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద ధాటికి ఆటోలోని వస్తువులన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోగా, ఆటో డ్రైవర్తో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ను క్లియర్ చేశారు

## శివరామ మందిరం నూతన కార్యవర్గం ఎన్నిక..



బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో గురువారం శివరామ మందిర నూతన కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షుడిగా నీరడీ వెంకటేష్ , ఉపాధ్యక్షులుగా సుంకరి శ్రీధర్ గౌడ్ , చిట్టాపురం పరుశరాములు ప్రధాన కార్యదర్శిగా ఇటికల సూర్యం, కార్యదర్శులు సుంకరి పరుషగౌడ్, తాడెం దుబ్బరాజం , కోశాధికారిగా కొత్త్తొల్ల స్వామి,సలహాదారులుగా గందె బాలరాజయ్య, పరికి ప్రేమ్ కుమార్, బొందుగులాపాటి శ్రీనివాసరావు, జంగం గంగా రాములు, చెల్లాపురం వెంకట్ గౌడ్, పెనుబెల్లి సుధాకర్ రెడ్డి, రంగయ్య గారి లక్ష్మారెడ్డి, పూలగారి బాల్ రెడ్డి, జంగం భూమా గౌడ్, పూస శ్రీధర్, జంగం రాజా గౌడ్, అందే తిరుపతి , పప్పుల రమేష్, ఆవుసుల ప్రసాద్, గుడ్ల ఆంజనేయులు, మహేష్ ఎన్నికయ్యారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సు..




ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాలు,పట్టణాల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీషబ్బీర్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద 99 రోజుల కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు.కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సులో షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ విభాగాల జిల్లా అధికారులు, నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ప్రభుత్వ 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు విస్తృత అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను తీసుకువచ్చిందని చెప్పారు.

ప్రభుత్వ పథకాలు నిజంగా ప్రజలకు చేరాలంటే గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.

అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ లక్ష్యాలు, కార్యాచరణ విధానం గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు.గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల కార్యచరణ ప్రణాళికను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు.ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి అభివృద్ధి ఫలాలను ప్రతి కుటుంబానికి చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్‌లు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్లు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి..

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



14 వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలు -- విద్యార్థులు , అధికారులు కోసం సూచనలు జిల్లా లో పదవ తరగతి పరీక్షలు ఈ సంవత్సరం 14.03.2026 నుండి 16.04.2026 వరకు మొత్తం 65 రెగ్యులర్ సెంటర్లలో జరుగనున్నాయి. మొత్తం 13,154 విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారు.ప్రధాన సూచనలు:పరీక్షా అధికారులు:

చీఫ్ సూపరింటెండెంట్ డిపార్టుమెంటల్ అధికారులు -- 65 ఇన్విజిలేటర్లు -- 739 పరీక్షా సమయం: ఉదయం 09:30 నుండి 12:30 మధ్యాహ్నం వరకు. విద్యార్థులు తమ కేటాయించిన కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరాలి.

హాల్ టికెట్:అధికారిక వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు: ఞఞఞ.ఎంవ్.వశ్రీఖఅస్త్రుఖఋ.స్త్రశీజ.ఱఅ??పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, పెన్స్, పెన్సిల్స్ మాత్రమే తీసుకెళ్ళాలి.నిషేధిత వస్తువులు:

సెల్ ఫోన్లు, పీజర్లు, క్యాల్కులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, పాఠ్యపుస్తకాలు, ప్రింటెడ్ మెటీరియల్స్, నకలులు నేరుగా కేంద్రానికి తీసుకురావడం అనుమతించబడదు.పరీక్షా వ్యవహారం:విద్యార్థులు పరీక్ష సమయంలో కేంద్రం నుంచి బయటకు వెళ్ళకూడదు, సమాధాన పత్రం పూర్తయినప్పటికీ, కేటాయించిన సమయం ముగిసే వరకు హాల్ లో ఉండాలి.హాల్ టికెట్ లేదా ఓ.ఏం.ఆర్.షీట్ లో ఏవైనా తప్పులు ఉంటే, ఇన్విజిలేటర్ లేదా చీఫ్ సూపరింటెండెంట్ కి వెంటనే తెలియచేయాలి. కంట్రోల్ రూమ్: 24 గంటల పాటు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9959670118 కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

## గుడ్న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి



: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా లేదా 50 శాతం రాయితీతో రవాణా సౌకర్యం కల్పిస్తామని జవీ రేవంత్ తెలిపారు. 'వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ-12 తరగతి విధానం తీసుకువస్తాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్, భోజనం అందిస్తాం' అని హైదరాబాద్ మాదాపూర్లో ఓ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో వెల్లడించారు.

## బిజెపి రాష్ట్ర మీడియా పానలిస్ట్ గా డా.బొంగోని సురేష్ గౌడ్.



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం నన్ను బీజేపీ రాష్ట్ర మీడియా పానలిస్ట్ గా నియమించడం పట్ల నాకు ఎంతో ఆనందం మరియు గౌరవంగా భావిస్తున్నాను. ఈ బాధ్యతను నాపై ఉంచిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ఈ సమయంలో, పార్టీ సిద్ధాంతాలను మరియు కేంద్ర ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు మీడియా ద్వారా మరింత సమర్థవంతంగా చేరవేయడానికి నా వంతు కృషి చేస్తాను. పార్టీ బలోపేతం కోసం, ప్రజల సమస్యలను సమాజం ముందుకు తీసుకురావడంలో మరియు పార్టీ విధానాలను ప్రజలకు వివరించడంలో నా బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని హామీ ఇస్తున్నాను. డా. బొంగోని సురేష్ గౌడ్ బీజేపీ రాష్ట్ర మీడియా పానలిస్ట్.

## నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి



కొమురవెల్లి మండల గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవ కమిటీ ధర్మకర్త లింగం-- కృష్ణవేణి దంపతుల పెద్ద కుమార్తె లాస్య -- శ్రీనివాస్ వివాహ వేడుకల్లో భాగంగా గుర్జకుంటలోని భద్రకాళి ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకల్లో కొమురవెల్లి, చేర్యాల మండల నాయకులతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి . ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవిని శ్రీనివాస్, ఆలయ చైర్మన్ గంగం నరసింహ రెడ్డి, కొమ్ము నర్సింగ్ రావు, గిరి కొండల్ రెడ్డి, మంజ మల్లేశం,లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, కోయడ శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్, బొచ్చు ఎల్లయ్య, చెరుకు రమణారెడ్డి, మల్లం బాలయ్య, జంగని రవి, తురాయి నవీన్ గౌడ్, స్వాములపల్లి రమేష్, దాసరి శ్రీకాంత్, కోళ్ల సాయిలు, ఎరుపుల రాజు, ఉప్పల వంశీకృష్ణ, చింతల పరుశరాములు, మాట్ల మురళి, పుట్ట కనకరాజు, బుడిగె బిక్షపతి, చంద్రం, గొల్లపల్లి శీను, సార్ల కనకయ్య, ఏసిరెడ్డి మల్లారెడ్డి, విజేందర్ రెడ్డి , చింతల రమేష్ పాల్గొన్నారు.

## 39 వ డివిజన్ ప్రజలందరికీ ఆహ్వానం



13-03-2026 శుక్రవారం ఉదయం 10.44 గంటలకు శివంజనేయ వీధి లో 39వ డివిజన్ బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభించడం జరుగుతుంది. కార్యాలయ ప్రారంభోత్సవానికి గౌరవనీయులు కరీంనగర్ మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ విచ్చేయుచున్నారు. 39వ డివిజన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ప్రజలందరూ హాజరు కాగలరని విజ్ఞప్తి చేస్తున్నాను డివిజన్ ప్రముఖులు , పెద్దలు ,మిత్రులు అమ్మలు, అక్కలు ,అన్న తమ్ముళ్లు, శ్రేయోభిలాషులు తమ తమ వ్యక్తిగత మరియు డివిజన్ సమస్యలు తెలియజేయడానికి ఉపయోగపడే విధంగా కార్యాలయం ఏర్పాటు చేస్తున్న దృశ్య ఇదే మీ అందరికీ ఆహ్వాన పత్రికగా భావించి తప్పకుండా హాజరు కాగలరని కోరుకుంటున్నాను. డివిజన్ ప్రజల శ్రేయస్సు అభివృద్ధి కోసం మీ అందరి సహకారం కోరుకుంటూ.మీ 39వ డివిజన్ సేవకుడు మాసం గణేష్ బీజేపీ కార్పొరేటర్.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో సాఫ్ట్ స్కిల్స్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ పైన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం



తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వులను ఆదేశించి కరీంనగర్ లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధి లోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు 100 వంద రోజులు ప్రణాళిక ఇవ్వడం జరిగింది. దానిలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేటకు విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించే పనిలో భాగంగా సాఫ్ట్ స్కిల్స్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ ని రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం వారు అనుమతులు ఇచ్చారు. ఈ రెండు రోజుల వర్క్ షాప్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం మరియు జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల ఎల్లారెడ్డిపేట వారు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి తెలియజేశారు. ఈ వర్క్ షాప్ నిర్వహించే తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం ప్రభాకర్,డాక్టర్ వై ఆంజనేయులు, డాక్టర్ జె శ్రవణ్ కుమార్, డాక్టర్ అడివిష్ణు, వి. వాణి,బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# సమన్వయంతో పనిచేయాలి!





## – ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఈకాలం, ఆదిలాబాద్**



ప్రభుత్వ పథకాలను అమలు చేసే ప్రక్రియలో ఉన్న సవాళ్ళను ముందుగా తెలుసుకొని అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రెవిన్యూ గార్డెన్లో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై సర్పంచ్ లు, కౌన్సిలర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాజర్శి షా తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలు వెంటనే పరిష్కారమవాలని భావించడం సహజమని, అయితే అధికారులకు ఉన్న పరిమితులను కూడా అర్థం చేసుకోవడం అవసరమని తెలిపారు. ప్రతి శాఖ ఏ పని చేస్తుందో ప్రజాప్రతినిధులు పూర్తిగా అవగాహన చేసుకోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయాల కంటే అభివృద్ధి పై ఎక్కువ దృష్టి పెట్టి, ప్రతి ఒక్కరి కోసం పని చేయాలని సూచించారు.సర్పంచులు, కౌన్సిలర్లు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.ఆదిలాబాద్ వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, అందరూ ఐక్యంగా పని చేస్తే ఆదిలాబాద్ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.




# యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం



## – ఆదిలాబాద్లో 'ఇన్నోవేషన్ పంచాయత్' నిర్వహణ
## – జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఈకాలం, ఆదిలాబాద్**

జిల్లాలోని యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పనిచేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన యువత, విద్యార్థులు, ఆవిష్కర్తలు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల ముందుంచి మార్గదర్శకత్వం పొందే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి దూరంగా ఉన్న జిల్లాలలో కూడా ప్రతిభావంతులైన యువతకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను సూచించే ఆలోచనలు ఉన్న వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవిష్కరణలను వెలికితీయడంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి రాష్ట్ర స్థాయి నిపుణుల నుండి ప్రత్యక్ష మార్గదర్శనం లభిస్తుందని తెలిపారు. తమ ఆలోచనల ఆచరణ సాధ్యతపై నిపుణుల ద్వారా ఐడియా వ్యాలిడేషన్ పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ప్రోటోటైప్ తయారీ, స్టార్టప్ అభివృద్ధి, వ్యాపార విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక మార్గదర్శనం అందిస్తారని వివరించారు. ప్రభుత్వ పథకాలు, ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ మద్దతు వ్యవస్థలతో అనుసంధానం చేసే అవకాశమూ కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు పోస్టర్లో ఇచ్చిన ఞ= కోడ్ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక వెబ్సైట్లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 91006 78543 నంబర్ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, ఆవిష్కర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వినూత్న ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.




# సిద్దిపేట జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ విధింపు

సిద్దిపేట జిల్లాలో జరగనున్న పదవ తరగతి (ఎస్ ఎస్ సి) వార్షిక పరీక్షల నేపథ్యంలో, పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు మరియు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, 163దీఛీూ 2023 సెక్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఛీూ 2023) సెక్షన్ 163 ప్రకారం, జిల్లాలోని 82 పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు.

ఈ ఆంక్షలు పరీక్షలు జరిగే రోజుల్లో, అంటే మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు, పరీక్ష జరిగే ప్రతిరోజూ ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు అమలులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్ళు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు కలిగి ఉండటం నేరం.



అలాగే, ఎగ్జామినేషన్ మెటీరియల్కు సంబంధించిన నిషేధిత కాగితాలను తీసుకెళ్లడం పూర్తిగా నిషేధం. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ ఉత్తర్వుల నుండి కింది వారికి మినహాయింపు ఉంటుంది:
- విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు.
- విధుల్లో ఉన్న సైనిక సిబ్బంది.
- విద్యాశాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు.

# ప్రభుత్వానికి అందజేయాల్సిన,8 కోట్ల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్కు తరలింపు

## – మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇద్దరిపై కేసు నమోదు



ప్రభుత్వానికి అందజేయాల్సిన రూ.8 కోట్ల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకున్నారనే అభియోగం మేరకు ఇద్దరు రైస్ మిల్ యజమానులను మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన రూ.8కోట్ల వడ్ల బియ్యం పక్కదారి పట్టించారనే అభియోగం మేరకు జన్నారం మండలం కలమడుగు గ్రామ సమీపాన ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ్మామాడ్రన్ రైస్ మిల్లు యజమానులైన యాదగిరి లక్ష్మికళ్యాణి, యాదగిరి స్వదేశిరావును అరెస్టు చేసినట్లుగా లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి. మంగళవారం సాయంత్రం తెలిపారు. కలమడుగు గ్రామంలోని లక్ష్మీనరసింహ్మా మాడ్రన్ రైస్ మిల్లుకు సరఫరా అయిన రూ.8 కోట్ల వడ్ల బియ్యాన్ని 2022 -- 2024 సంవత్సరాలకుగాను ప్రభుత్వ సివిల్ సప్లైకి సరఫరా చేయలేదు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలోనే కేసు నమోదు చేసి, మంగళవారం సాయంత్రం ఆ ఇద్దరు యజమానులను అరెస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయంశమైంది.

# నిజాంబాద్ జిల్లా లో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్య



నిజామాబాద్ జిల్లా ఉమ్మడి ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు ఈమ్మడి గోపి ముదిరాజ్ దారుణ హత్య ఈమ్మడి గోపి ముదిరాజ్ రాజకీయ కక్ష్యాల నేపథ్యం లోనే గోపి ముదిరాజ్ గారి మేనల్లుడు ఆయనను దారుణంగా అత్య చేయటం జరిగింది.ఈమ్మడి గోపి ముదిరాజ్ గారు ఆతి సామాన్య కుటుంబంలో జన్మించి జాతి శ్రేయస్సు కోసం పాటు పడుతూ ధార్పల్లి మండల ఎంపీపీ పనిచేశారు...బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఇందల్వాయి మండలంలోనీ తన గ్రామానికి కారులో వెళ్తున్న సమయంలో మరో కారులో వచ్చి కార్ ను డి కొట్టి కత్తులతో పొడిచి ఆతి దారుణంగా హత్య చేయటం జరిగింది .ఏది ఏమైనా మరో ముదిరాజ్ బిడ్డరాజకీయంగా ఎదిగే క్రమంలో రాజకీయ పాత కాక్ష్యాల నేపథ్యం లోనే మర్డర్ కావటం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో సంచల విషయం.ఈ హత్యను చేసిన వారిని చేయించిన వారిని కఠినంగా శిక్షించాలి మండల వాసులు ముక్త కంఠంతో చెప్తున్నారు

# దుబ్బాక ఆస. ముత్యం కు బీ. ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు.2026.




సీనియర్ దళిత నాయకుడు ఆస ముత్యం ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు -2026కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జాతీయ అవార్డు కమిటీ అధికారికంగా ప్రకటించింది.అవార్డు ఎంపిక పత్రాన్ని నల్ల రాధాకృష్ణ, బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు అంబేద్కర్ సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, హైదరాబాద్లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు బహుజన సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలు, కవులు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తుందని తెలిపారు. ఈనెల మార్చి 15న ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో జరగనున్న బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఆస ముత్యం ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ కాన్ఫరెన్స్కు దక్షిణ భారతంలోని ఆరు రాష్ట్రాలు--- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు మరియు పుదుచ్చేరి--- నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.

# తెలంగాణకు త్వరలో కొత్త పోలీస్ బాస్.

## – తుది దశకు చేరిన డీజీపీ ఎంపిక ప్రక్రియ.



ఢిల్లీలో ఎంపిక కమిటీ సమావేశంకు హాజరైన సీఎస్ రామకృష్ణారావు. సీవీ ఆనంద్, శిఖా గోయల్, సౌమ్య మిశ్రా, వినాయక్ ప్రభాకర్ ఆప్టే పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం. నలుగురిలో ఒకరి పేరు తీసేసి ముగ్గురి పేర్లతో కూడిన జాబితాను రాష్ట్రానికి పంపనున్న యూపీఎస్సీ యూపీఎస్సీ పంపిన ముగ్గురిలో ఒకరిని ప్రభుత్వం ఎంపిక చేయాల్సి ఉంటుంది అయితే రేవంత్ రెడ్డి సీవీ ఆనంద్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం..

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149